క్లుప్తంగా

నగదు రహిత లావాదేవీలు ప్రారంభం


బోడసకుర్రులో నగదు రహిత లావాదేవీలు చేస్తున్న కార్యదర్శి దుర్గా శ్రీనివాస్

అల్లవరం: గ్రామ పంచాయతీల్లో డిజిటల్ సేవలు చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో బోడసకుర్రు గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం తొలిసారిగా డిజిటల్ సేవలను ప్రారంభించారు. ఇక నుంచి పంచాయతీ ద్వారా ఆర్థిక లావాదేవీలన్నీ నగదు రహితంగానే నిర్వహిస్తామని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి దుర్గా శ్రీనివాస్ వ్యాపారస్తుల నుంచి పేటీఎం ద్వారా నగదు రహిత స్వీకరణ చేశారు.

కొమరగిరిపట్నం ఉపసర్పంచ్ రాజీనామా


రాజీనామా లేఖను ఎంపీడీఓ కృష్ణమోహన్‌కు అందజేస్తున్న ఉప సర్పంచ్ శ్రీనివాసరావు

అల్లవరం: కొమరగిరిపట్నం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ బొక్కా శ్రీనివాసరావు తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమోహన్‌కు రాజీనామా లేఖను అందజేశారు. వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లుగా లేఖలో పేర్కొన్నారు. నిబంధనల మేరకు పరిశీలన అనంతరం రాజీనామాను ఆమోదించి తదుపరి చర్యలకు జిల్లా పంచాయతీ కార్యాలయానికి నివేదిక పంపించామని ఎంపీడీఓ తెలిపారు.

గురువులు మార్గదర్శకులు


ఉపాధ్యాయులను సత్కరించిన మహిళా వాకర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: భావి భారతానికి నిజమైన మార్గదర్శకులు గురువులేనని అమలాపురం మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక భూపయ్య అగ్రహారంలో సోమవారం విశ్రాంత ఉపాధ్యాయురాలు కూచిమంచి నాగమణి, ప్రధానోపాధ్యాయురాలు పి.సుందర శిరోమణిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ ప్రతినిధులు యర్రమిల్లి అనంతలక్ష్మి, గోటేటి లక్ష్మి, శిష్టా లక్ష్మి, దువ్వూరి సుబ్బలక్ష్మి, రామ తులసి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ సభ్యునిగా శామ్యూల్ సాగర్



తాళ్లరేవు: కాకినాడ జిల్లా సివిల్ సప్లయిస్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా నుంచి ఉత్తర్వులు అందినట్లు శామ్యూల్ సాగర్ సోమవారం విలేకర్లకు తెలియజేశారు. తనను విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా నియమించిన జిల్లా కలెక్టర్, పార్టీ నాయకులకు శామ్యూల్ సాగర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ఎల్ఐసీ డీవో సేవలు అభినందనీయం


సాల్మన్‌రాజు దంపతులను సత్కరిస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు, డీవోలు

అమలాపురం టౌన్: ఎల్ఐసీ సంస్థలో 30 ఏళ్ల పాటు డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీవో)గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన బి.సాల్మన్‌రాజు సేవలు అభినందనీయమని అమలాపురం ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ వై.శ్రీధర్ అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన స్మాలన్‌రాజుకు సీనియర్ ఏజెంట్లు, డీవోలు, ఎల్ఐసీ కార్యాలయ సిబ్బంది స్థానిక శ్రీకళా గ్రాండ్‌లో సోమవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజు దంపతులను గజమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెర మీద పాఠాలు

- బ్లాక్ బోర్డుతో పని లేకుండా విద్యా బోధన
- ఐఎఫ్ ప్యానల్‌తో ఎన్నో ఉపయోగాలు


అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే కాకుండా విద్యార్థులకు సాంకేతికత ఆధారంగా ప్యానల్(టీవీ) తెరలపై పాఠాలు బోధించి వారిలో గుణాత్మక విద్యను వృద్ధి చేయడం కీలక పరిణామంగా కనిపిస్తుంది. నాడు–నేడు ద్వారా ప్రభుత్వం ఉన్నత పాఠశాలలకు ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌గా(ఐఎఫ్‌పీ) పిలుచుకునే భారీ టీవీ తెరలను సమకూర్చడంతో విద్యా బోధన కొత్త పుంతలు తొక్కుతోంది. అమలాపురం పట్టణంలోని రెండు మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, రెండు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రస్తుతం బ్లాక్ బోర్డులతో పని లేకుండా ఐఎఫ్ ప్యానల్ ద్వారానే విద్యా బోధన అందిస్తున్నారు. ఉపాధ్యాయులు సైతం మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని అత్యుత్తమ విద్యా బోధన అందించేందుకు కృషి చేస్తున్నారు.

ఒక్క పాఠశాలలోనే 14 ఐఎఫ్ ప్యానళ్లతో బోధన

అమలాపురం పట్టణంలోని అయిదు ఉన్నత పాఠశాలలకు ఐఎఫ్‌పీ విద్యా బోధన విధానం అమలులోకి వచ్చింది. మిగతా ఉన్నత పాఠశాలలకు అయిదు నుంచి పది ప్యానళ్లు వస్తే మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాలకు 14 ప్యానళ్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ పాఠశాలలోని 26 మంది ఉపాధ్యాయులు 6 నుంచి 10 తరగతి విద్యార్థులకు ఈ విధానం ద్వారానే విద్యా బోధన అందిస్తున్నారు. నేడు– నేడుకు ఎంపికైన మిగిలిన నాలుగు ఉన్నత పాఠశాలల్లోనూ ఇదే విధానంలో బోధన అందుతోంది.

దృశ్య రూప బోధనతో మేలు

విద్యార్థులకు దృశ్య రూపంలో ప్యానల్ (తెర)పై చూపిస్తూ తరగతి పాఠాలు చెబితే వారికి పాఠం బాగా అర్థమవుతుంది. ఉదాహరణకు మనిషి శరీరంలోని గుండెపై పాఠం చెప్పాల్సి వస్తే ఐఎఫ్ ప్యానల్‌లో ఉండే ఇంటర్నెట్, యూట్యూబ్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవొచ్చు. ప్యానల్‌లో ఉండే టూల్స్‌ను ఉపయోగించి గుండె బొమ్మను, అది పనిచేసే దృశ్యాలను తక్షణమే డౌన్‌లోడ్ చేసుకుని తెరపై చూపించి అవకాశం కలుగుతుంది. ప్రపంచ దేశాల్లో ఏ దేశం మ్యాప్‌నైనా ఇలానే క్షణాల్లో కదలికలతో కూడిన దృశ్యాలను చూపిస్తారు. ఇదే పాఠం మళ్లీ విద్యార్థులకు చెప్పాలనుకుంటే ఆ ప్రోగ్రామ్‌ను ఆ ప్యానల్‌లో సేవ్ చేసుకుని ఎప్పుడైనా ఆ పాఠాన్ని బోధించే వెసులబాటు ఉంటుంది.

విషయాన్ని వేగంగా సంగ్రహించే వెసులుబాటు



విద్యార్థులు సాధారణ విద్యా బోధన కంటే అధునాతన, సాంకేతిక విలువలతో కూడిన విద్యా బోధనతోనే విషయాన్ని వేగంగా సంగ్రహించే వెసులబాటు కలుగుతోంది. ఈ విప్లవాత్మక మార్పులు రాష్ట్ర ప్రభుత్వం విద్యాలయాల్లో ప్రవేశపెట్టిన నాడు–నేడు ద్వారానే సాకారమైంది. ఐఎఫ్ ప్యానల్స్ ద్వారా విద్యాంశాలను త్రీడీ ఎఫెక్ట్‌తో కూడా వీక్షించే సౌకర్యం ఉంది.

– గుబ్బల సూర్యప్రకాశం, ఎంఈవో, అమలాపురం

విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతోంది



నాడు–నేడు ద్వారా మా పాఠశాలకు మంజూరైన 14 ఐఎఫ్ ప్యానళ్ల ద్వారానే మొత్తం తరగతులన్నీ నిర్వహిస్తున్నాం. ఈ సరికొత్త సాంకేతిక సౌకర్యం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెరుగుతున్నాయి. పాఠ్యాంశాలకు చెందిన అంశాలను సునాయాసంగా ఆకళింపు చేసుకుంటున్నారు. మా పాఠశాలలోని 26 మంది ఉపాధ్యాయులూ ఈ విధానం ద్వారానే విద్యా బోధన చేస్తున్నారు.

– బీఆర్ కామేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు, మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల, అమలాపురం

రాష్ట్ర మినీ ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


మినీ ఫుట్‌బాల్ పోటీల్లో తృతీయస్థానం సాధించి ట్రోఫీని అందుకుంటున్న క్రీడాకారులు

తాళ్లరేవు: చిత్తూరు జిల్లా పూతలపట్టు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ నెల 3వ తేదీన జరిగిన 3వ ఏపీ స్టేట్ మినీ ఫుట్‌బాల్ పోటీల్లో తాళ్లరేవు మండల విద్యార్థులు ప్రతిభ కనబరిచి మూడో స్థానాన్ని సాధించారు. మినీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ –13, అండర్–17, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో అండర్–17 విభాగంలో జార్జిపేట ఎంఎల్‌కే నగర్‌లోని సెయింట్ జోసెఫ్స్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి మూడో స్థానంలో నిలిచి ట్రోఫీని అందుకున్నట్లు స్కూల్ పీఈటీ సూర్యాపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులను పలువురు అభినందించారు.

కొత్త పింఛన్ల పంపిణీ

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం పంచాయతీ పరిధిలో మూడు సచివాలయాల్లో నూతనంగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ మూడు సచివాలయాల పరిధిలో 40 మంది లబ్ధిదారులకు కొత్త పింఛన్లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ గుర్రం బాబులు, కార్యదర్శి ఎస్‌వీవీ సత్యనారాయణ, వార్డు మెంబర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా వెంకటేశ్వరరావు



ఉప్పలగుప్తం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా నంగవరం –1 ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న వాసంశెట్టి వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరంలో ఆయన పురస్కారం అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామ సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి, ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, ఎస్.సత్యకృష్ణ, ఎస్టీయూ మండల అధ్యక్షుడు సూదా రామారావు అభినందించారు.

అక్రమ మట్టి తవ్వకాల అడ్డగింత

కాట్రేనికోన: మండలంలోని కాట్రేనికోన పంచాయతీ నాగపట్టణం వద్ద చెరువులో సాగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను గచ్చకాయలపోర గ్రామ పెద్దలు సోమవారం అడ్డుకున్నారు. పత్రభూమికి, రక్షణ గట్టుకు మధ్యలో ఉన్న చెరువులో సుమారు ఏడు అడుగుల లోతు వరకూ మట్టిని తవ్వేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మట్టి అక్రమ తవ్వకాలు తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీనిపై తహసీల్దార్ సత్యనారాయణను వివరణ కోరగా మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు.

సైకిల్ యాత్ర ప్రారంభం

అమలాపురం టౌన్: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరావు స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి సైకిల్ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఆయన కూడా కొంత దూరం సైకిల్ తొక్కి యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ మదన్, రాష్ట్ర కార్యదర్శి అశోక్, కోకన్వీనర్లు కారెం ప్రణీత్ సాయి, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పంట బోదెలో పడిపోయిన బొలెరో


పంట బోదెలోకి పడిపోయిన బొలెరో వాహనం

అల్లవరం: పిఠాపురం నుంచి అల్లవరం వస్తున్న బొలెరో వాహనం గుడ్డివానిచింత వద్ద అదుపు తప్పి పంట బోదెలోకి పడిపోయింది. పేరూరు నుంచి గోడిలంక వరకూ రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో వాహనాలను దేవగుప్తం–ఎంట్రుకోన మీదుగా అల్లవరం ప్రధాన రహదారికి మళ్లిస్తున్నారు. సోమవారం ఉదయం బొలెరో వాహనం దేవగుప్తం రోడ్డుకి వచ్చి వెనక్కి మళ్లించే క్రమంలో అదుపుతప్పి పంట బోదెలోకి జారిపోయింది. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని పోలీసులు తెలిపారు. క్రేను సహాయంతో వాహనాన్ని బోదెలో నుంచి పైకి తీశారని చెప్పారు.

సత్యనారాయణకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



సత్యనారాయణకు అవార్డు అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

అమలాపురం రూరల్: విద్యార్థులకు 25 ఏళ్లుగా సేవలందించినందుకు సాకుర్రు ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఉప్పే సత్యనారాయణరావుకు ఫిలాంత్రోపిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రదానం చేసింది. సర్వేపల్లి రాధాకృష్ణన్ 135వ జయంతి సందర్భంగా రాజమహేంద్రవరంలో ఎల్ఐసీ ఉద్యోగ భవనంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణకు వైఎస్సార్ సీపీ కేంద్ర పాలకమండలి సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, డీఈవో అబ్రహం చేతుల మీదుగా అవార్డు అందజేసి సత్కరించారు. అవార్డు అందుకున్న సత్యనారాయణను హెచ్ఎం బాబూరావు, సర్పంచ్ గుత్తుల చిరంజీవి, మాజీ సర్పంచ్ ముల్లపర్తి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ పొలమూరి బాలకృష్ణ, బొక్కా నరసింహమూర్తి తదితరులు అభినందించారు.

బాధిత కుటుంబానికి దాత సాయం


మూలాస్వామి కుటుంబ సభ్యులకు నగదు, దుస్తులు అందజేస్తున్న చప్పిడి లక్ష్మణరావు తదితరులు

ముమ్మిడివరం: రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని వరగల్లంక గ్రామానికి చెందిన శీలం మూలస్వామి కుటుంబానికి దాత చప్పిడి లక్ష్మణరావు ఆర్థిక సాయం చేశారు. మూలాస్వామికి రెండేళ్ల క్రితం పక్షవాతం రావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. జీవనాధారం లేక ఇబ్బందులు పడుతున్న వారి కుటుంబ పరిస్థితిని ఠాణేల్లంక మొల్లి నివాసి జేవీఎల్ నరసింహరావు హైదరాబాద్‌లో స్థిరపడిన తన బాల్య మిత్రుడు చప్పిడి లక్ష్మణరావుకు తెలియజేశారు. లక్ష్మణరావు స్పందించి స్వయంగా మూలాస్వామి ఇంటికి వచ్చి ఆయన కుటుంబానికి రూ.10 వేల నగదు, రూ.3 వేల విలువైన మందులు, రూ.2 వేల విలువ గల దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో వెలువలపల్లి సోంబాబు, రాయుడు సత్యనారాయణ, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ముమ్మిడివరం: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.దుర్గా ప్రసాద్, సఖిలే సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కోర్సుల్లో 10 శాతం రిజర్వేషన్లకు ఆమోదం

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎంబీబీఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పుదుచ్చేరి సీఎం రంగసామి ఆధ్వర్యాన క్యాబినెట్ తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన ఫైలును కేంద్ర హోం శాఖ సోమవారం రాత్రి ఆమోదించింది. దీంతో ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, నీట్ ర్యాంకు సాధించిన అభ్యర్థులకు 10 శాతం మెడికల్ సీట్లు రానున్నాయి. ఈ నిర్ణయాన్ని మంగళవారం నుంచి జరగనున్న మెడికల్ కోర్సుల కౌన్సెలింగ్‌లో అమలు చేయనున్నారు. ఈ ఫైల్‌ను ఆమోదించిన ప్రధాని మోదీ, ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవ్య తదితరులకు లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కృతజ్ఞతలు తెలిపారు. పేద విద్యార్థులకు ఎంబీబీఎస్ చదువులు అందడానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని పలువురు పేర్కొన్నారు.

108 డ్రైవర్ల నిరసన


ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న 108 డ్రైవర్‌లు

యానాం: తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ యానాం 108 డ్రైవర్లు సోమవారం శాంతియుతంగా నిరసన తెలియజేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ర్యాలీగా పరిపాలనాధికారి కార్యాలయం వద్దకు చేరుకుని నల్ల రిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి ముసలయ్య, కె.రామలింగం తదితరులు మాట్లాడుతూ గత పదిహేడేళ్లుగా సేవలందిస్తున్నా ఉద్యోగ భద్రత లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

యానాం: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు నూతన కార్యాలయాన్ని ప్రారంభించినట్లు బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ కె.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. స్థానిక పడవలరేవు వీధిలో ఉండే బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ కార్యాలయాన్ని విష్ణాలయం వీధిలోకి మార్చామన్నారు. కార్యక్రమంలో డివిజినల్ మేనేజర్ జేజేశ్వరరావు, మేనేజర్ బి.మహేష్ పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ ఎన్నికలు ప్రశాంతం

మూడు చోట్లా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం


విత్తనాల పార్వతి


బిళ్లకుర్తి రామలక్ష్మి


కోరుకొండ అప్పారావు

తాళ్లరేవు: మండల పరిధిలోని మూడు గ్రామ పంచాయతీల్లో సోమవారం ఉపసర్పంచ్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. తాళ్లరేవు గ్రామ పంచాయతీలో ఎన్నిక జరగగా, ఇంజరం, లచ్చిపాలెం పంచాయతీల్లో ఏకగ్రీవమయ్యాయి. తాళ్లరేవు పంచాయతీలో పోటాపోటీగా జరిగిన ఎన్నికలో విత్తనాల పార్వతి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ఎంఎస్ భాస్కర్‌రాజు, నున్న శంకరనారాయణలు ప్రకటించి ధృవీకరణ పత్రం అందజేశారు. ఉపసర్పంచ్‌గా ఎన్నికైన పార్వతిని జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ తదితరులు అభినందించారు. లచ్చిపాలెం పంచాయతీలో బిళ్లకుర్తి రామలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంజరం పంచాయతీలో కోరుకొండ అప్పారావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.

ఉప సర్పంచ్‌గా కనకదుర్గ


కనకదుర్గకు నియామక పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి కామేశ్వరరావు

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి ఉపసర్పంచ్‌గా దొంగ కనకదుర్గ సోమవారం ఎన్నికయ్యారు. గతంలో ఎన్నికల సమయంలో చేసుకున్న జెంటిల్‌మెన్ ఒప్పందం ప్రకారం ఇప్పటివరకూ మారిశెట్టి దుర్గారావు ఉపసర్పంచ్‌గా కొనసాగి రాజీనామా చేయగా నూతనంగా దుర్గను వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి కె.కామేశ్వరరావు కనకదుర్గకు నియామక పత్రం అందించారు. నూతనంగా ఎన్నికైన కనకదుర్గను ఏఎంసీ చైర్మన్ చప్పిడి దుర్గారావు, సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, సొసైటీ అధ్యక్షుడు మారిశెట్టి పుండరీకాక్షుడు, బడుగు గణేష్, దోనిపాటి బాలమ్మ తదితరులు అభినందించారు.

స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ


యానాంలో స్వచ్ఛతా ర్యాలీ చేస్తున్న నవోదయ విద్యార్థులు

యానాం: పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ నవోదయ విద్యాలయ విద్యార్థులు సోమవారం స్థానిక గణపతినగర్ పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. యానాం నవోదయ విద్యాలయంలో ఈ నెల 1వ తేదీ నుంచి స్వచ్ఛతా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతను తెలియజెప్పే నినాదాలు చేస్తూ ప్లకార్డులతో ర్యాలీ చేశారు. అనంతరం కరపత్రాలను అందజేశారు. తొలుత ఈ ర్యాలీని నవోదయ ప్రధానోపాధ్యాయులు టీవీఎస్ ప్రకాశరావు జెండా ఊపి ప్రారంభించారు. విద్యాలయ అధ్యాపకులు స్కౌట్, గైడ్ కెప్టెన్ డి.పాపారావు, అపర్నారాజ్ రామారావు, రియాజ్, మంజూశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బడ్డీ తొలగించారంటూ కేసు

యానాం: యానాం పొట్టిశ్రీరాములు వారధి నుంచి పాతబస్టాండ్ దారిలో తమ టిఫిన్ సెంటర్ బడ్డీని, కొబ్బరి ఆకులతో వేసుకున్న పందిరిని దౌర్జన్యపూరితంగా తొలగించారని గొల్ల అప్పారావు దంపతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేరు నూకరాజు సోమవారం తెలిపారు. సదరు స్థలం తమ ఆటో యూనియన్‌కు కేటాయించారని అక్కడి నుంచి బడ్డీ తొలగించాలంటూ ఆటో యూనియన్ డ్రైవర్లు వారితో ఈ నెల 30న గొడవపడ్డారు. తాము తొలగించేది లేదని చెప్పడంతో కొంతమంది డ్రైవర్లు టిఫిన్ సెంటర్ బడ్డీని పక్కకు నెట్టేయడంతో పాటు పందిరిని దౌర్జన్యంగా తీసివేశారంటూ బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

అల్లవరం: పేరూరు నుంచి గోడిలంక ప్రధాన రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో విద్యుత్ స్తంభాలను పక్కకు జరుపుతున్నందున మంగళవారం 11 కేవీ ఓఎన్‌జీసీ ఫీడర్ నుంచి విద్యుత్‌కు అంతరాయం కలగనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ రవికుమార్ సోమవారం తెలిపారు. కోడూరుపాడు విక్టరీ బజార్ నుంచి బోడసకుర్రు ఆక్వా చెరువులు, అల్లవరం సబ్ స్టేషన్ నుంచి పెట్రోల్ బంక్ వరకూ మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ ఉండదన్నారు.

ఆక్వా అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి


స్పందనలో అధికారులకు అర్జీ అందిస్తున్న సొసైటీ అధ్యక్షుడు పుండరీకాక్షుడు, రైతులు

ఉప్పలగుప్తం: మండంలోని కూనవరంలో సర్వే నెంబరు 6/1లో ఓ రైతు అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నాడని, అధికారులు స్పందించి వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి స్పందనలో గొల్లవిల్లి సొసైటీ అధ్యక్షుడు మారిశెట్టి పుండరీకాక్షుడు గ్రామానికి చెందిన పలువురు రైతులతో కలిసి తహసీల్దార్ జె.వెంకటేశ్వరికి, ఎఫ్‌డీవో నాగమణిలకు అర్జీ అందించారు. తాము వ్యవసాయం చేసుకునే పంట పొలాలను ఆనుకుని అనధికారకంగా చెరువులు తవ్వుతున్నారని, దీంతో తమ పంట భూములు పాడవుతున్నాయని అధికారులకు వివరించారు. అదే విధంగా పొలాల మీదుగా కిలోమీటర్ల మేర ఆక్వా చెరువులకు సరఫరా అందించడానికి విద్యుత్ వైర్లను నేలపై పరుచుకుంటూ వెళ్లిపోయారన్నారు. వాటి వల్ల మనుషులకు, పశువులకు ప్రమాదాలు జరగొచ్చని విద్యుత్ అధికారులకు సమాచారం అందించినా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుచేసిన వారిలో జి.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, అడపా దుర్గారావు, మారిశెట్టి నరేష్ తదితరులున్నారు.

నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలి

అంబాజీపేట: ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలతో డ్రైనేజీని నిర్మించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు అన్నారు. మాచవరం మెట్లకాలనీలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను సోమవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆదేశాల మేరకు డ్రైనేజీని రూ.5 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు. కాలనీలో అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే చిట్టిబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో ఇటీవల డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారన్నారు. ఈ డ్రైనేజీని వినాయకుడి గుడి వద్ద నుంచి మోకా వారిపేట వరకు నిర్మిస్తున్నామన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

అయినవిల్లి: పూరిల్లు కాలి బూడిదైన ఘటనలో కట్టుబట్టలతో మిగిలిన మూడు కుటుంబాల బాధితులకు గన్నవరపు సూర్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వంట సామగ్రి, గిన్నెలు, రైస్ ప్యాకెట్లు, దుస్తులు, నిత్యావసరాలను ట్రస్టు నిర్వాహకుడు, అయినవిల్లి జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు సోమవారం అందజేశారు. అయినవిల్లి మండలం వెలువలపల్లిలో ఆదివారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలడంతో అగ్నిప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన బూల లక్ష్మి, బూల గంగాజలం, చెల్లి అంజలి అనే మూడు కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. అగ్నిప్రమాదానికి గురైన ఇల్లును పరిశీలించి ప్రభుత్వం నుంచి వచ్చే సహాయం కూడా అందేలా అధికారులతో మాట్లాడి స్థానిక సర్పంచ్ బొంతు మణి, ఎంపీటీసీ చల్లాబత్తుల సాయిలక్ష్మి ఆధ్వర్యంలో సహాయం చర్యలు తీసుకుంటామని జెడ్పీటీసీ తెలిపారు.

ప్రకటన

[illegible]

కుడుపూడి అశోక్, అడ్వకేట్
అమలాపురం. సెల్ : 95163 36780